క్లుప్తంగా

భక్త జనసంద్రంగా మల్లన్న జాతర

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మాసాన్‌పల్లిలో సోమవారం రెండో రోజు మల్లన్న దేవుని జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవులు మల్లన్న చరిత్రపై ఒగ్గుకథ వినిపించారు. సంగారెడ్డి, కామారెడ్డి, తదితర జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. కార్యక్రమంలో మాజీ ఆత్మ చైర్మన్ దిలిప్‌కుమార్, వైస్‌ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్‌లు కమలమ్మ, మన్నే సులోచన, మాజీ సర్పంచ్ గోపాల్, ఉపసర్పంచ్ రాముజ్యోషి, నాయకులు నారాయణరావు పటేల్, భూపాల్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణోత్సవం

నారాయణఖేడ్: మండల పరిధిలోని నమ్లిమేట్ గ్రామంలో సోమవారం మల్లన్నస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు అంజన్న, లక్ష్మారెడ్డి, శివకుమార్ తదితరులు ఉన్నారు.

ఘనంగా దుర్గామాత ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో సోమవారం దుర్గామాత ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పుణ్యావాచన, గౌరి గణపతి పూజ, నవగ్రహ వాస్తు క్షేత్ర పాలక ఆవాహిత మంటప దేవతా పూజ, దుర్గామాతా అభిషేకం, అలంకరణ కార్యక్రమాలను పురోహితులు ఆనంద్‌శర్మ నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. రాత్రి 7 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.

స్వామివారికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పూజలు

పటాన్‌చెరు: మండల పరిధిలోని లక్డారం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


మాట్లాడుతున్న పద్మశాలి సంఘం అధ్యక్షుడు జనార్దన్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పద్మశాలి భవనంలో పద్మశాలి సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆ సంఘం అధ్యక్షుడు గడ్డం జనార్దన్ మాట్లాడుతూ పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, సామాజికపరంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. యువత అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ గంజి కృష్ణ, పద్మశాలి సంఘం నాయకుల కర్దాస్ మనోహర్, రమేష్ బాబు, నాందేవ్, కనుకుంట్ల నర్సింహులు, విఠల్, నాగరాజ్, శ్రీనివాస్, లక్ష్మణ్, సుధీర్ బండారి, గొల్ల మల్లయ్య, విజయ్‌కుమార్, మరెల్లి వెంకటయ్య, సత్యనారాయణ, రాంలింగం, మల్లేశం పాల్గొన్నారు.

16 మందిపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పటాన్‌చెరు సీఐ లాలూనాయక్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి హెచ్చరించారు. పటాన్‌చెరు బస్టాండ్, ముత్తంగి రింగ్ రోడ్, ఇస్నాపూర్ చౌరస్తాలో ఆదివారం ఆదివారం రాత్రి స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. డ్రంక్ డ్రైవ్‌లో 15 ద్విచక్ర వాహనాలు, కారును సీజ్ చేశారు. అదేవిధంగా మద్యం తాగి వాహనాలు నడిపిన 16మందిపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన సంబంధిత వ్యక్తులను సంగారెడ్డి కోర్టులో హాజరుపరుస్తామని సీఐలు తెలిపారు.

నారాయణఖేడ్‌లో...

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నారాయణఖేడ్ పట్టణంలో డ్రంకన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ స్పెషల్‌డ్రైవ్‌లో మద్యం తాగిన 10మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

‘డబుల్’ కల నెరవేరేనా?


జిన్నారంలో ఫిల్లర్ల దశలోనే నిలిచిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు

- అర్ధాంతరంగా ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలు
- నాలుగేండ్లు గడుస్తున్నా ముందుకు కదలని పనులు
- డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేదలు
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించాలని వేడుకోలు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఆయా గ్రామాల నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కల ఇప్పట్లో నెరవేరేటట్టు లేదు. పనులు ప్రారంభమై నాలుగేళ్లవుతున్నా పనులు ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న తమకు నిరాశే మిగిలిందని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు డబుల్ బెడ్ రూం ఇళ్లను నెరవేర్చాలని ఆయా గ్రామాల నిరుపేదలు కోరుతున్నారు.

జిన్నారం మండలంలోని కొడకంచి, జిన్నారం గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనుల అధికారులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపలు చేసి ఐదేళ్లవుతోంది. కొడకంచి గ్రామంలో 48 ఇళ్లు మంజూరు కాగా శ్లాబుల వరకు మాత్రమే పనులు చేపట్టి ఆతర్వాత పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. అదేవిధంగా జిన్నారం మండల కేంద్రంలో 58 ఇళ్లు మంజూరు కాగా ఫిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. రూ.3కోట్లతో 2019లో డబుల్ బెడ్ రూం పనులు ప్రారంభమైన నాలుగేళ్లవుతున్నా ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో పేదలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వం, ఉన్నతాధికారులపై అసహనం

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకురావకపోవటంతోనే పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకునేనాథుడు కరువయ్యాడని లబ్ధిదారులు వాపోతున్నారు.

గత ప్రభుత్వం పట్టించుకోలేదు

అర్ధాంతరంగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయినా గతంలో ఉన్న అధికార పార్టీ నాయకులు పట్టించుకోలేదు. ఈ విషయమై కలెక్టర్ చొరవ తీసుకోవాలి. కాంగ్రెస్ హయాంలో పేదలకు న్యాయం జరగాలని కోరుకుంటున్నాం. పనుల ప్రారంభం విషయమై స్థానిక ఎమ్మెల్యే, ముఖ్య నాయకులు, ఉన్నతాధికారులతో చర్చించి పనులు కొనసాగేవిధంగా కృషి చేస్తా.

– రవీందర్‌గౌడ్, ఎంపీపీ జిన్నారం

సొంతిల్లు లేక ఇబ్బంది పడుతున్నాం

సొంతిల్లు లేక ఇబ్బంది పడుతున్నాం. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్‌రూం ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్న. కానీ.. ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వమైనా డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించాలని కోరుతున్న.

– యాదమ్మ, జిన్నారం గ్రామం

కాంగ్రెస్ ప్రభుత్వంపై పేదల ఆశలు..

గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు ముందుకుసాగడంలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలోనైనా త్వరితగతిన పనులను పూర్తి చేయించేవిధంగా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వెంటే చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల పేదలు కోరుతున్నారు.

నూతన సంవత్సరానికి స్వాగతం

జిల్లావ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను సోమవారం చిన్నాపెద్దా లేకుండా ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ప్రజాప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యువత కేక్‌లు కట్ చేసి ఉల్లాసంగా గడిపారు. పలుచోట్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

– సంగారెడ్డి న్యూస్ డెస్క్


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి


మంత్రి దామోదరకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌గౌడ్


జహీరాబాద్: ఎంపీ బీబీపాటిల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న షేక్ ఫరీద్, నాయకులు


ఝరాసంగం: కేతకీ సంగమేశ్వర ఆలయంలో భక్తుల సందడి


కల్హేర్: రుక్మిణీ పాండురంగ మందిరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


పటాన్‌చెరు: సిద్ధి వినాయకుడి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


జిన్నారం: మాజీ మంత్రి హరీశ్‌రావుతో మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, నాయకులు


నారాయణఖేడ్: ఎమ్మెల్యే సంజీవరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐలు


సదాశివపేటలోని సీపీఐ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

వైభవంగా పడిపూజ


పడి పూజలో గురుస్వామి రుపేశ్

తూప్రాన్: అయ్యప్ప దేవాలయంలో రుపేశ్ గురుస్వామి ఆధ్వర్యంలో మహా పడిపూజ సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. నేతి మహేశ్, సత్య నారాయణ, అంజాగౌడ్, యాదగౌడ్, భిక్షపతి గౌడ్, రమేశ్‌రెడ్డి, శ్రీహరి, నాగేశ్, తిమ్మాపురం నర్సింలు, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ని సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాదులోని ఆమె నివాసంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి ఆధ్వర్యంలో 2024 సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు సునీత, అంజిరెడ్డి, పెంటారెడ్డి, సీఈఓ మధు తదితరులు ఉన్నారు.

ముత్యంరెడ్డి సేవలు మరువలేనివి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చేగుంట(తూప్రాన్): దివంగత ఎమ్మెల్యే చెరుకు ముత్యంరెడ్డి జయంతిని చేగుంటలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వడ్ల నవీన్ ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తా వద్ద ముత్యంరెడ్డి ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి పార్టీ అభిమానులు ఒకరికొకరు పంచుకున్నారు. సర్పంచ్ భాస్కర్, నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈటలను కలిసిన వెంగళ్‌రావు


ఈటలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వెంగళ్‌రావు

చేగుంట(తూప్రాన్): మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసినట్లు బీజేపీ జిల్లా నాయకులు వెంగళ్‌రావు తెలిపారు. సోమవారం ఈటలను కలిసిన వెంగళ్‌రావు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన అంశాలపై ఈటలతో చర్చించినట్లు వెంగళ్‌రావు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో అక్షింతల ఊరేగింపు


పటాన్‌చెరు: అక్షింతల ఊరేగింపులో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు


కల్హేర్: అక్షింతలను పంపిణీ చేస్తున్న బాధ్యులు


జిన్నారం: అక్షింతల ఊరేగింపులో పాల్గొన్న జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, నాయకులు


రామచంద్రాపురం: శ్రీరాముడి అక్షింతలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం నుంచి ఏర్పాటు చేసిన అయోధ్య శ్రీరాముడి పూజిత అక్షింతల ఊరేగింపులో సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర..

కల్హేర్(నారాయణఖేడ్): అయోధ్య శ్రీరాముడి అక్షింతలను సోమవారం కల్హేర్, మార్డి, తదితర గ్రామాల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర బాధ్యులు సంగమేశ్వర్‌రావు, హన్మండ్లుసేట్, వెంకటేశం, హన్మంతు, సంగయ్య పాల్గొన్నారు.

శివానగర్ గ్రామంలో..

జిన్నారం(పటాన్‌చెరు): అయోధ్య రామాలయం నుంచి వచ్చిన స్వామివారి అక్షింతలతో శివానగర్ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అక్షింతలు పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అయోధ్య శ్రీరామ ఆలయ ప్రాణప్రతిష్ఠ ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో శ్రీరాముని అక్షింతలను బెల్ నుంచి హెచ్‌ఐజీ కమ్యూనిటీహాల్ వరకు అక్షింతల ఊరేగింపు నిర్వహించారు.

అంబేడ్కర్ సేవాసమితి అధ్యక్షుడిగా సాయిలు


సాయిలు

నారాయణఖేడ్: అంబేడ్కర్, పూలే సేవా సమితి నిజాంపేట్ మండలశాఖ అధ్యక్షుడిగా బేగరి సాయిలు నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ రహీం, పండరిల ఆదేశాల మేరకు డివిజన్ అధ్యక్షులు నర్సింహులు ఆధ్వర్యంలో సోమవారం ఖేడ్‌లోని సంఘం ప్రాంతీయ కార్యాలయంలో సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ నిజాంపేట్ మండలంలో సంఘం మండల, గ్రామ స్థాయి కమిటీలు వేసి చట్టాలు, మానవహక్కులపై అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఘనంగా అయ్యప్ప ఆభరణాల ఊరేగింపు


ఆభరణాల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలో సోమవారం అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపు, పల్లకీ సేవలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్లాక్‌టవర్, గాని చౌరస్తా, పోచమ్మ దేవాలయం, పబ్బతి హనుమాన్ దేవాలయం మీదుగా హౌసింగ్ బోర్డులోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్ చిట్టిబాబు, గురుస్వాములు, దేవరశెట్టి సంతోష్, కృష్ణయాదవ్, విజయ్‌కుమార్, మల్లేశం, నాగేష్, స్వాములు మర్వెళ్లి నరేష్, శ్రీనివాస్‌గౌడ్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన


రామంతాపూర్ తండాలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నోడల్ అధికారి హర్షవర్ధన్

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం రామంతాపూర్, రామంతాపూర్ తండా పంచాయతీల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. శెట్టిపల్లికలాన్ ఇండియన్ బ్యాంక్ నోడల్ అధికారి హర్షవర్ధన్ ఆధ్వర్యంలో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు. కేంద్ర పథకాలపై క్షేత్రస్థాయిలో చాలామందికి అవగాహన లేకపోవడంతో అర్హులకు లబ్ధి చేకూరడం లేదన్నారు. పథకాలు గ్రామీణ స్థాయిలో చేరాలనే కేంద్రం సంకల్పయాత్రకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. అంతకుముందు కేంద్ర పథకాలకు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫకీరా, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డిని నార్సింగి బీజేపీ నాయకులు సోమవారం మండల కేంద్రంలో సన్మానించారు. కామారెడ్డి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఎమ్మెల్యేను ఆపి సన్మానించారు. బీజేపీ నాయకులు వెంకటరమణరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపయజేశారు.

ప్రమాదకరంగా వారధులు

- అదుపు తప్పితే అంతే సంగతులు
- విరిగిన రక్షణ దిమ్మెలు
- పట్టించుకోని అధికారులు


ప్రమాదంగా మెల్లూర్ - కొప్పులపల్లి వంతెన

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో వాగులు, కాల్వలపై నిర్మించిన వారధులు, కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. మండలంలోని మంగళపర్తి, మానెపల్లి గ్రామాలను కలిపే వారధి నేడు ధ్వంసమైంది. మెల్లూర్ – కొప్పులపల్లి రెండు గ్రామాల మధ్య ఉన్న కాలువపై నిర్మించిన వంతెన వల్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోయింది. అయితే ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలకు ఇరువైపుల ఉన్న రక్షణగోడలు విరిగిపోయాయి. దీంతో ఈ వంతెన గుండా ప్రయాణించేటప్పుడు, ఏ మాత్రం ఆదమరిచినా వాగులోకి పడిపోవడం ఖాయం. శిథిలావస్థకు చేరిన వంతెన వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రయాణికులు జంకుతున్నారు. వంతెలనకు రక్షణ దిమ్మెలు ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, ప్రమాదం పొంచి ఉన్న వంతెనల వద్ద మరమ్మతులు, నూతన వంతెనలను నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.